సాక్షి సంగారెడ్డి

గురువారం ▪ 9 ▪ ఫిబ్రవరి ▪ 2023



పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

యాజమాన్యం నిర్లక్ష్యంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. 8లో



డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలి

పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. 9లో



ఉత్సవాలకు సహకరించాలి

బీరంగూడ మల్లికార్జున స్వామి జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కోరారు. 9లో

న్యూస్‌రీల్

పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి



పార్కును సందర్శిస్తున్న రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేస్తున్న పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధికారులకు సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న పలు పార్కులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పార్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాజీవ్

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు కూడా శ్రద్ధతో చదవాలని సర్వశిక్షా అభియాన్ జేడీ రాజీవ్ అన్నారు. జిన్నారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాకేంద్రాన్ని బుధవారం జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య తీరును స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం నల్తూర్, కొర్లకుంట గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థినులను ఉపాధ్యాయులు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు శ్రీనివాస్, రంజిత తదితరులు పాల్గొన్నారు.

బాలిక మరణంపై విచారణ చేపట్టాలి



డీఏఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నారాయణఖేడ్: సిర్గాపూర్ గిరిజన గురుకులంలో ఇంటర్ విద్యార్థిని రమావత్ లక్ష్మి రెండంతస్తుల భవనం పైనుంచి పడి చనిపోయిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారితో విచారణ జరపాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, సీఐటీయూ డివిజన్ నాయకులు చిరంజీవి నారాయణఖేడ్ డీఏఓ చంద్రకళకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై ప్రిన్సిపాల్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాచారం ఇస్తున్నారని, ఘటన జరిగిన తర్వాత తల్లిదండ్రులకు ఆలస్యంగా సమాచారం ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్, కేవీపీఎస్ నాయకులు సంజు, దళిత, గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు.

మహాశివరాత్రికి చకచకా ఏర్పాట్లు



కేతకి ఆలయంలో కొనసాగుతున్న పనులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం షామియానాల ఏర్పాటు, ఆలయ రాజగోపురంతో పాటు పరిసరాల్లో రంగులు వేస్తున్నారు. ఇప్పటికే ఝరాసంగంతో పాటు జహీరాబాద్ పట్టణంలోని ఆలయ కమాన్, ఝరాసంగంలోని గ్రామదేవతల ఆలయాలకు రంగులు వేయడం పూర్తి చేశారు. అధికారుల సూచన మేరకు ఈనెల 16వ తేదీలోపు ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు ఈఓ శశిధర్, పాలకమండలి చైర్మన్ నీల వెంకటేశం పేర్కొన్నారు.

తాగుడు మానలేదని...

తనువు చాలించారు

భర్త చేష్టలతో విసిగిపోయిన భార్య

- కొడుకు, కూతురుతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య
- తల్లీకూతురు మృతి.. ప్రాణాలతో బయటపడిన కొడుకు



పున్నెమ్మ(ఫైల్)

ఆత్మహత్య చేసుకున్నది ఈ బావిలోనే

ప్రాణాలతో బయటపడిన రాము

ఏ పనీ చేయడం లేదు.. చెప్పినా వినడం లేదు.. తాగుడుకు అలవాటు పడ్డ భర్తతో విసిగివేసారిపోయిన ఓ భార్య చావు తప్ప మరోమార్గం లేదనుకుంది. తాను పోతే బిడ్డలు ఎలా బతుకుతారో అనుకుందో ఏమో.. పిల్లలను తోడుగా తీసుకెళ్లింది. ఒకరి చేతులు ఒకరు పట్టుకొని బావిలో దూకేందుకు సిద్ధమయ్యారు. ముందుగా కూతురును బావిలో తోసేసింది. ఈ హఠాత్ పరిణామాన్ని చూసిన కొడుకు విస్తుపోయాడు. తల్లిచేతిలో ఎడమ చేయి ఉండగా, పక్కనే ఉన్న చెట్టుకొమ్మను కుడి చేతితో పట్టుకున్నాడు. తల్లి బావిలోకి దూకగా, చెట్టుకొమ్మను గట్టిగా పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డాడు.

న్యాల్‌కల్(జహీరాబాద్): ఓ తల్లి తన బిడ్డలతో కలిసి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని రాంతీర్థ్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. తల్లీ కూతురు చనిపోగా, కొడుకు ప్రాణాలతో బయటపడ్డాడు. హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్, గ్రామస్తుల కథనం ప్రకారం.. రాజోల గ్రామానికి చెందిన పున్నెమ్మ(30)కి రాంతీర్థ్‌కు చెందిన మల్లేశ్‌కు 2012లో వివాహం జరిగింది. వారికి కూతురు సంగీత(9), కుమారుడు రాము(7) సంతానం. కూతురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతుండగా, కుమారుడు అదే పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పేదవారు కావడంతో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మద్యానికి అలవాటు పడిన మల్లేశ్ చెప్పిన మాట వినేవాడు కాదు. పని కూడా సరిగా చేసేవాడు కాదు. తాగొద్దని ఎన్నిమార్లు చెప్పినా వినలేదు. భార్య పున్నెమ్మ కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఎప్పటిలాగే బుధవారం ఉదయం పున్నెమ్మ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శనగ పంట కోసేందుకు వెళ్లింది. పంట కోయడం పూర్తి కావడంతో మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చింది. ఎన్నడూ పనికి వెళ్లని భర్త ఆ రోజు కూలికి పోయాడు. న్యాల్‌కల్ జాతర సందర్భంగా పాఠశాలకు లోకల్ హాలీడే ప్రకటించారు. దీంతో కూతురు, కుమారుడు ఇంటి వద్దే ఉన్నారు. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం చనిపోదామంటూ ముగ్గురు కలిసి శంశర్ అలీ బావి వద్దకు వెళ్లారు. అందరూ కలసి బావిలో దూకేందుకు నిర్ణయించి ఒకరి చేతులు ఒకరు పట్టుకున్నారు. ముందుగా పున్నెమ్మ తన కుమార్తె సంగీతను బావిలోకి తోసేసింది. అనంతరం కుమారుడితో కలసి బావిలోకి దూకింది. ఇది గమనించిన కుమారుడు పక్కనే ఉన్న చిన్న చెట్టును పట్టుకున్నాడు. తల్లి మాత్రమే బావిలోకి జారిపోయింది. ఈ ఘటన నుంచి బయటపడిన రాము గ్రామంలోకి వెళ్లి జరిగిన సంఘటనను కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ అక్కడికి చేరుకొని గ్రామస్తుల సహకారంతో మృతదేహాలను బావిలోంచి తీయించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భర్త తాగుడుకు అలవాటు పడి చెప్పిన మాట వినకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

అందరితో కలిసిమెలిసి ఉండేది

5వ తరగతి చదువుతున్న సంగీత అందరితో కలిసిమెలిసి ఉండేదని పాఠశాల హెచ్‌ఎం, తోటి విద్యార్థులు తెలిపారు. 3వ తరగతి వరకు అమ్మమ్మ ఊరైన రాజోలలో చదివిన సంగీత 4వ తరగతికి ఈ పాఠశాలకు వచ్చింది. గత నెలలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భరతమాత వేషధారణతో అందరిని ఆకట్టుకుందని, ఇలా జరుగుతుందని అనుకోలేదని హెచ్‌ఎం షేక్ మహబూబ్, తోటి విద్యార్థులు బోరుమన్నారు.



భరత మాత వేషధారణలో సంగీత

చెట్టే కాపాడింది

బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన రామును చిన్న చెట్టే కాపాడింది. ముగ్గురూ ఒకరి చేతులు ఒకరు పట్టుకొని బావిలోకి దూకేందుకు సిద్ధమవగా భయాందోళనకు గురైన రాము కుడి చేతితో పక్కన ఉన్న చిన్న చెట్టును పట్టుకున్నాడు. ముందుగా అక్కను బావిలోకి తోసేసిన విషయాన్ని గుర్తించిన రాము చెట్టును వదలకుండా పట్టుకోవడంతో తల్లి మాత్రమే బావిలోకి జారిపోయింది. ఏడేళ్ల రాము ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ అదే విషయం చర్చించుకోవడం కనిపించింది. అందరం కలసి చచ్చిపోదామని మా అమ్మ బావి వద్దకు తీసుకువెళ్లిందని రాము ఏడుస్తూ చెప్పాడు.



రామును కాపాడిన చెట్టు

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి



కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): భారత రాష్ట్ర సమితి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర బుధవారం మండల పరిధిలోని తొగర్‌పల్లిలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.ప్రభుతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత బంగారు తెలంగాణ అని చెప్పిన సీఎం కేసీఆర్ నేడు పేదలు బతకలేని స్థితికి తీసుకువచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పేదలకు అండగా ఉంటుందన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని పేర్కొన్నారు. సంగారెడ్డిలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ ఎంపీపీ అంజనేయులు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, నాయకులు వెంకటేశం గౌడ్, ఇంద్రారెడ్డి, సునీల్, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రకాశం, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



సంగారెడ్డి టౌన్: జిల్లాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనిస్తేటిస్ట్ 1, డాటా ఎంట్రీ ఆపరేటర్ 1, మెడికల్ ఆఫీసర్ 1, మెడికల్ ఆఫీసర్ పిడియాట్రీషన్ 1, ఫిజియోథెరపిస్ట్ 1 పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు, మార్గదర్శకాలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వెబ్సైట్ sangareddy.telangana.gov.in నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

టీబీపై అవగాహన తప్పనిసరి



టీబీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: కార్మికులకు టీబీ పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలని టీబీ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని ఎంవైకే లాటిక్రీట్ ఇండియా పీవీటీ ఇండస్ట్రీలో జాతీయ క్షయ నివారణ సంస్థ, టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో బ్రేక్ ఇన్ ది బ్యారియర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో టీబీపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఏదైనా ఛాతి సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల శ్వాసకోశ వ్యాధులు ఎక్కువ మందికి వ్యాపిస్తాయని, ప్రతి ఒక్కరికీ టీబీ లక్షణాలు, నివారణ చర్యలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి తెలియాలన్నారు. 95 మందికి ఎక్స్‌రేలు తీశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టెక్నికల్ అడ్వైజర్ సురేశ్, కంపెనీ మేనేజర్ రామచందర్, పటాన్‌చెరు టీబీ కోఆర్డినేటర్ కృష్ణ, చంద్రకళ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2,000, కాస్మోటిక్ చార్జీలు రూ.250లకు పెంచాలని, కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీని రూ.1,000కి పెంచాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలతో ప్రస్తుతం వస్తున్న మెస్, కాస్మోటిక్ చార్జీలు ఏమాత్రం సరిపోవటం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అధికారులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశంలోనే మెస్, కాస్మోటిక్ చార్జీలు, ప్యాకెట్‌మనీ పెంచుతున్నట్లు వెంటనే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు దాస్, దత్తు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పెద్ద చెరువును కబ్జాదారుల నుంచి కాపాడుతున్నామని ఇరిగేషన్ శాఖ ఏఈ ప్రసాద్ అన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలను ఉపేక్షించడం లేదన్నారు. సాక్షిలో 'కబ్జాలో పెద్ద చెరువు' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం ఆ నిర్మాణాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఈ ప్రసాద్ ఆధ్వర్యంలో జేసీబీతో అక్కడ నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ బేస్‌ను తొలగించారు. అలాగే ఆ భూ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా పలువురు పట్టాదార్లు మట్టి పోసి చెరువును పూడ్చిన ఘటనల్లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తాజాగా నిర్మాణం చేపట్టినందుకుగాను కేసు పెడుతున్నట్లు వివరించారు. పెద్ద చెరువును కబ్జా చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. అమీన్‌పూర్‌లో చెరువులన్నింటిని పరిరక్షిస్తామని, నిర్మాణాలు తొలగించే సమయంలో ఎన్నో వత్తిళ్లు వచ్చాయని, అయినా వాటిని తొలగించినట్లు తెలిపారు.

చిరు ధాన్యాలకు ప్రాధాన్యం



ఎడ్ల బండ్ల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): చిరు ధాన్యాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని బసంత్‌పూర్ – మామిడ్గి గ్రామ శివారులోని ప్రొఫెసర్ జయంశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సర్పంచ్ శివశంకరయ్యస్వామి అధ్యక్షతన డీడీఎస్ ఆధ్వర్యంలో 23వ పాత పంటల జాతరను ప్రారంభించారు. ఈ సదస్సుకు హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల పాత పంటల వైపు మొగ్గు చూపడం లేదన్నారు. మనం సాగు చేస్తున్న పంటలతో పాటు కొంత మేర చిరు ధాన్యాలను కూడా సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా రైతులను సన్మానించారు. చిరు ధాన్యాలతో కూడిన ఎడ్ల బండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో జీవ వైవిధ్య రైతు నర్సమ్మ, ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సంగమ్మ, చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఆనందరావు, డీడీఎస్ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

పట్టణాభివృద్ధికే అవిశ్వాసం విరమణ

అధికార పార్టీకి చెందిన జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

జోగిపేట(అందోల్): డబ్బుల కోసం కాదని, కేవలం పట్టణం అభివృద్ధి జరగాలన్న ఉద్దేశంతోనే అవిశ్వాసం పెట్టడంలేదని, మున్సిపల్ చైర్మన్ ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలతో విసుగు చెందినట్లు అందోలు – జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు భవాని, దుర్గేశ్, భారతి, నాగరాజు, చందర్‌నాయక్‌లు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే సమక్షంలో చైర్మన్ అందరిని కలుపుకొని వెళ్తానని చెప్పి మరుసటి రోజు నుంచే యథాతథంగా వ్యవహరిస్తూ వస్తున్నాడని ఆరోపించారు. తాము ఎమ్మెల్యేకు వ్యతిరేకం కాదని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేస్తామన్నారు. చైర్మన్ వైఖరి వల్లనే చాలా మంది కమిషనర్లు బదిలీలు కావాల్సి వచ్చిందని తెలిపారు. మూడేళ్లలో మున్సిపల్ భవనాన్ని నిర్మించలేకపోయారన్నారు. మొత్తం 12 మంది సభ్యుల్లో ఎనిమిది మంది బీసీలు ఉన్నారని, ఇందులో ఎవరిని చైర్మన్ పదవికి ఎంపిక చేసినా అందరం మద్దతునిస్తామని స్పష్టం చేశారు. తమ వార్డుల్లోని సమస్యలను పట్టించుకోవడంలేదని, ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, దీంతో పార్టీకి, తమకు వ్యక్తిగతంగా నష్టం జరుగుతుందన్నారు. పలువురు కౌన్సిలర్ల కుటుంబ సభ్యుల ఉద్యోగాల విషయాలలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్లు సుమిత్ర, మాధవి, భాగ్యలక్ష్మి, ప్రవీణ, జాకియా సుల్తానాలు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీలలో ఈనెల 28లోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీఎల్‌పీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద యాక్టివ్ లేబర్‌లో 50 శాతం లేబర్ మొబిలైజేషన్ జరగాలన్నారు. చేసిన పనికి రికార్డులు ఉండాలని, సంబంధిత లేబర్లకు పేస్లిప్స్ ఇవ్వాలని సూచించారు. పలువురు పంచాయతీ సెక్రెటరీల నిర్లక్ష్య ధోరణిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త అమ్మకంతో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని ఆదేశించారు. మొక్కలకు నీటిని అందించే ఏర్పాట్లు చేయాలని, ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలన్నారు. వైకుంఠధామాలు, వైకుంఠరథాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వైకుంఠధామాల చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసరా పింఛన్లకు అర్హత ఉన్న వారిని గుర్తించి వారి ఈనెల 23లోగా ఎంపీడీఓలకు పంపాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయా ప్రతిపాదనలను వెంటనే డీఆర్‌డీఓకు సమర్పించాలని ఎంపీడీఓలకు ఆదేశించారు. పింఛన్లకు సంబంధించి ఎలాంటి పెండింగ్ ఉండరాదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, అదనపు పీడీలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

మన బడి పనుల్లో వేగం పెంచండి

మన ఊరు – మన బడి కార్యక్రమంలో జిల్లాలో వివిధ పాఠశాలల్లో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యా, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. పనులు బాగా చేస్తున్న కల్హేర్ ఏఈ మాధవనాయుడును అభినందించారు. పాఠశాలలకు వేస్తున్న పెయింటింగ్ క్వాలిటీ బాగుండాలని పెయింటింగ్ ఏజెన్సీలకు ఆదేశించారు. ఆయా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్‌కు సూచించారు.

క్లుప్తంగా

మహిళా రైతుకు రుణం మంజూరు



మహిళా రైతుకు చెక్కు అందజేస్తున్న చైర్మన్, డైరెక్టర్

రామాయంపేట(మెదక్): కోళ్లఫారం ఏర్పాటుకు నిజాంపేట మండలం నస్కల్ గ్రామ రైతు మంగలి సిద్దవ్వకు సహకారం సంఘం రుణం మంజూరు చేసింది. రూ.18 లక్షలు చెక్కు రూపంలో విడుదల చేసింది. ఈ చెక్కును బుధవారం సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, సంఘం డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి సిద్దవ్వకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు రుణాల మంజూరు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ పుట్టి నర్సింహులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఎస్ఐగా మహేశ్‌కుమార్



అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్ఐ మహేశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ కొత్త ఎస్ఐగా తోట మహేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన మహేశ్‌కుమార్ సిద్దిపేటలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్.మహేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మహేశ్‌కుమార్‌ను సీఐ ఎర్రల కిరణ్ అభినందించారు.

మంత్రిని కలిసిన దళిత సంఘాల నాయకులు



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న నాయకులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర బడ్జెట్‌లో దళితబంధుకు సముచిత నిధుల కేటాయింపుపై దళిత సంఘాల ప్రతినిధులు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం వారు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బీమసేన, రాములు, కనకయ్య ఉన్నారు.

రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం

- రసాయనాల తరలింపులో పాటించని నిబంధనలు
- రాపిడితో ఎగిసి పడ్డ మంటలు
- ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- పరుగులు తీసిన కార్మికులు, ఉద్యోగులు
- ఆందోళనలో సమీప పరిశ్రమల యాజమాన్యాలు
- సందర్శించిన అధికారులు, కేసు నమోదు



ఎగిసి పడుతున్న మంటలు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. రసాయనాలను తరలిస్తున్న సమయంలో పాటించాల్సిన కనీస నిబంధనలను పాటించకపోవటంతో మంటలు ఎగిసి పడ్డాయి. మంటలను ఆపేందుకు ఐదు గంట పాటు అగ్నిమాపక సిబ్బంది, కార్మికులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

జిన్నారం మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడాలోని లీఫార్మా లిమిటెడ్ పరిశ్రమలో ప్రతినిత్యం వేల సంఖ్యలో కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో కార్మికులు ఎవరిపనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. పరిశ్రమలోని సాల్వెంట్ రికవరీ ప్లాంట్‌లో రసాయనాలను తరలిస్తున్న సమయంలో రసాయనాల రాపిడి జరగటంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న కార్మికుడు హరినాథ్ రెడ్డి చేతులు కాలిపోగా, మరో కార్మికుడు రవికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగి ఒక్కసారిగా భారీ పేలుడు, మంటలు, దట్టమైన



మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్న సిబ్బంది, కార్మికులు



గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

పొగ వెలువడటంతో కార్మికులు, ఉద్యోగులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. ప్లాంటులో ఎక్కువగా డ్రమ్ముల్లో రసాయనాలు నిల్వ ఉండటంలో డ్రమ్ములు ఎగిసి పడ్డాయి. భారీ శబ్దంతో పారిశ్రామిక వాడ దద్దరిల్లింది. పటాన్‌చెరు, జీడిమెట్ల, నర్సాపూర్ ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్‌వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు శ్రమించారు. ఐదు గంటల పాటు శ్రమించి ఫైర్ సిబ్బంది, కార్మికులు, యాజమాన్యం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు సమీప పరిశ్రమలకు వ్యాపించకపోవటంతో పక్కనే ఉన్న పరిశ్రమల యాజమాన్యాలు ఊపిరి పీల్చుకున్నాయి. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పరిశ్రమలో ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగేందుకు గల కారణాలను తెలుసుకున్నామని, పరిశ్రమ యాజమాన్యంపై కేసును కూడా నమోదు చేశామన్నారు. బొల్లారం సీఐ సురేందర్‌రెడ్డి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు.

రుణమాఫీకి అరకొర నిధులు

డీసీసీ కార్యదర్శి బైరం కుమార్



రామాయంపేట(మెదక్): రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే కేటాయించడం రైతులను మోసగించడమేనని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి బైరం కుమార్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రుణమాఫీకోసం అరకొర నిధులు కేటాయించి సీఎం చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. గత ఎన్నికలముందు రూ. లక్ష రుణమాఫీకి సీఎం కే సీఆర్ ఇచ్చిన హామీ పూర్తిగా విఫలమైందని, ఇప్పటి వరకు కేవలం రూ.37 వేలు మాత్రమే మాఫీ జరిగిందన్నారు. రుణమాఫీపై ప్రభుత్వం తాత్సరం చేయడంతో బ్యాంకుల్లో రైతులు తీసుకున్న అప్పు రెట్టింపయ్యిందన్నారు. రుణమాఫీ సంపూర్ణంగా అమలు కావాలంటే మొత్తం రూ.20,875 కోట్లు అవసర మున్నట్లు సాక్షాత్తు ఉన్నతాధికారులు ప్రకటించారని చెప్పారు. తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రైతు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ఇప్పటికే పార్టీ పెద్దలు ప్రకటించారని, కాంగ్రెస్ హామీ ఇస్తే విస్మరించదని స్పష్టంచేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన రుణమాఫీ పద్ధతిని ఇప్పటికీ రైతులు గుర్తు చేసుకుంటున్నారన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి



సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మెదక్ కలెక్టరేట్: గ్రామపంచాయతీ కార్మికులకు రావాల్సిన రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడుతూ ఎలా పనులు చేస్తారని ప్రశ్నించారు. ఏడుపాయల జాతరలో పారిశుధ్య పనులు చేయడానికి వెళ్లే వారికి కనీస వసతులు కల్పించాలన్నారు. అలాగే గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, నాయకులు పద్మారావు, రాములు, నర్సింలు, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, వారికి కనీస వేతనం ఇవ్వాలని, బకాయి వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ నాయకులు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 60 జీఓ ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.15600, కారోబార్, బిల్ కలెక్టర్లకి రూ.19500, డ్రైవర్లకు రూ. 22,750 వేతనాలు పెంచాలన్నారు. 51 జీఓని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హులైన వారికి దళిత బంధు తో పాటు డబుల బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 12 నుంచి జనగామ జిల్లా పాలకుర్తి నుంచి ఫిబ్రవరి 28 వరకు 300 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. పాదయాత్ర జయప్రదానికి కార్మికులు, శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించాలన్నారు. 28న జరిగే ముగింపు సభకు గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ధర్నాకు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.



మెదక్‌లో పంచాయతీ అధికారి సాయిబాబాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

కోహెడ(హుస్నాబాద్): వ్యవసాయ విద్యుత్ కోతలపై కోహెడ మండల కేంద్రం సబ్ స్టేషన్ వద్ద తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన రైతులు బీజేపీ నాయకులతో కలసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలో ఎక్కడాలేని విధంగా కోహెడ మండలంలో మాత్రమే అధికారులు కోతలు విధిస్తున్నరని మండిపడ్డారు. కోహెడ మండలం బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. విద్యుత్ కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఏఈ ఆదివారం నాటికి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

నేటి నుంచి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని దేవునూర్, పాలడుగు గ్రామాల శివారులో ఏటా నిర్వహించే హజ్రత్ బాబా భూదాన్‌షాటలి ఉర్సే షరీఫ్ ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సర్కారి గంధం, పోలీస్ పటేల్, మాలిపటేల్ ఆధ్వర్యంలో ఊరేగింపు, 10న దేవునూర్ గ్రామ గంధం, 11న పాలడుగు, భూత్కూర్, వట్‌పల్లి, గట్‌పల్లి, పల్వట్ల గ్రామాల్లో గంధాల ఊరేగింపు ఉంటుందన్నారు. 12న కుస్తీ పోటీలు జరుగుతాయని, మొదటి బహుమతి 5 తులాల వెండి కడియం అందిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొండెంగ దాడిలో వ్యక్తికి గాయాలు



గాయపడ్డ మోహన్‌రెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): కొండెంగ దాడిలో వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గినియార్ పల్లి గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి న్యాల్‌కల్ నుంచి గినియార్‌పల్లి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఝరాసంగం శివారులోకి రాగానే కొండెంగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఝరాసంగం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

దుబ్బాక: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మంది వ్యక్తులకు దుబ్బాక ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సల్మా ఫాతిమ జరిమానా విధించారు. దుబ్బాక పట్టణంలో లచ్చపేట, దుంపలపల్లి ప్రధాన మార్గాల్లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా 10 మంది ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరచగా ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సల్మా ఫాతిమ వారికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున మొత్తం రూ.20వేల జరిమానా విధించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 22 మందికి మొత్తం రూ.1100 జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్‌నిబంధనలు పాటించాలని, రూల్ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు బుధవారం జరిమానా విధించింది. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీ ల్లో 11 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కో ర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్ బాబు రూ.25 వేల జరిమానా విధించారు.

కొల్చారంలో దర్గా ఉర్సు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారం లోని హజ్రత్ షేక్ షహాబొద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గంధం ఊరేగింపు నిర్వహించారు. దర్గా నుంచి ప్రధాన రహదారి చేరువలోని షాబుద్దీన్ దర్గా వరకు ఊరేగించారు. పూలు, చాదర్‌తో అలంకరించి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు చేశారు. ఈ ఉత్సవాలకు మతాలకతీతంగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఖవ్వాలి నిర్వహించారు.

‘కంటి వెలుగు’ శిబిరం తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): ప్రచారం లేక శిబిరాలు వెల వెల శీర్షికతో బుధవారం వార్త ప్రచురితమైంది. కంటి వెలుగుపై ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించడం, జనం లేక శిబిరం వెలవెలబోతుండటంతో సాక్షి వెలుగులోకి తెచ్చింది.ఈ వార్తకు కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. బుధవారం గడిపెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సందర్శించారు. రోజూ ఎంత మందికి కంటి పరీక్షలు చేస్తున్నారని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి అద్దాలు అందజేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కంటి వెలుగుపై ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గడిపెద్దాపూర్ కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ అనిల కూడా తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలో ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ సయ్యద్, డాక్టర్ ఫౌజియా, సర్పంచ్ అమ్మయమ్మ తదితరులు పాల్గొన్నారు.



గడిపెద్దాపూర్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సాయిబాబా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోహీర్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దిగ్వాల్ గ్రామంలో 65 నంబర్ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం కొత్తకోల్‌కుంద గ్రామస్తుడు అర్షద్ (16) తన మిత్రుడు జహీర్ బైక్‌పై వెళ్తున్నాడు. జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వెళ్తున్న కంటెయినర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అర్షద్ జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జహీర్‌కు కూడా గాయాలవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి నిజామొద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.



అర్షద్ మృతదేహం

చికిత్స పొందుతున్న యువకుడు..

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన రంగనాథ్ (28) ఫార్మా పరిశ్రమలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. జనవరి 11వ తేదీన తన స్నేహితులు శ్యామ్ సాయి, జనార్దన్ తో కలిసి బైక్ పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పడంతో పటాన్‌చెరు శివారు పోచారం కూడలి సమీప కాలువలో పడ్డారు. దీంతో రంగనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని బీరంగూడ కూడలిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

పంచాయతీరాజ్ అధికారికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): అదుపు తప్పి కారు రోడ్డు పక్కన పొలంలో దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పంచాయతీరాజ్ అధికారికి స్వల్ప గాయాలయ్యాయి. మండల పరిధిలోని మల్లారం శివారులో ఈ ఘటన బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన బోసి ఆనంద్ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పంచాయతీరాజ్‌లో డిప్యూటీ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కారులో హైదరాబాద్ నుంచి ఇచ్చోడ వెళ్తున్న క్రమంలో మల్లారం శివారులో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలోకి దూసూకెళ్లి బోల్తాపడింది. సమీప రైతు గమనించి గాయాలైన ఆనంద్‌ను భయటకు తీసి, 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.



పొలంలోకి దూసుకుపోయిన కారు

ఆటోబోల్తా : వ్యక్తికి గాయాలు

చేగుంట(తూప్రాన్): ఆటో బోల్తాపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట పట్టణానికి చెందిన దాసరిరాజు పాత సామాన్ల వ్యాపారి. పాత సామాన్లు కొనుగోలు చేసి వాటిని ట్రాలీ ఆటోలో తూప్రాన్ నుంచి చేగుంటకు తెస్తుండగా మాసాయిపేట వద్ద అకస్మాత్తుగా ఆటో బ్రేకు వేయడంతో బోల్తాపడింది. ఈప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన రాజు

లారీని ఢీకొన్న బైక్

ఒకరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

గజ్వేల్‌రూరల్: రోడ్డు మలుపులో లారీని బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గజ్వేల్ పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గజ్వేల్ ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం మంతూర్‌కు చెందిన భానుప్రసాద్, నవీన్, తంగెళ్లపల్లి మురళీదాస్(18) గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద ప్రజ్ఞాపూర్ నుంచి పిడిచెడ్ రోడ్డు వెళ్తున్న లారీని కొన్నారు. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న మురళీదాస్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. భానుప్రసాద్, నవీన్‌లకు గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎదురెదురుగా ఆటో-బైక్ ఢీ

బోల్తాపడ్డ ఆటో, ఎనిమిది మందికి గాయాలు

రామాయంపేట(మెదక్): కామారెడ్డి రూటులో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటో బోల్తా పడి ఏడుగురు ప్రయాణికులు, బైక్ నడుపుతున్న వ్యక్తి గాయపడ్డారు. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన మహిళలు మూడు ఆటోల్లో కూరగాయల వ్యాపారం నిమిత్తం రామాయంపేటకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో ఆటో, బైక్ పరస్పరం ఢీకొనగా ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న గుర్జకుంటకు చెందిన బద్దం యశోద, బాసం రాజమణి, ఎల్లల యశోద, ఎల్లల మంజుల, గొల్ల కవిత, ఎల్లల రాధవ్వతో పాటు మరో ఇద్దరు మహిళలు, బైక్ నడుపుతున్న రామాయంపేటకు చెందిన పర్వుగల్ల నర్సింహులు గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకొని గ్రామస్తులు, బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి తరలివచ్చారు. ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడ్డ మహిళలు



తగలబడుతున్న సామగ్రి

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం

దుబ్బాక: తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట 11వ వార్డులో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వార్డులో శిథిలావస్తలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఖాళీ ప్రాంగణంలో తాజుద్దీన్ నిర్వహిస్తున్న తుక్కు దుకాణంలో అకస్మాత్తుగా మంటలు రేగాయి. సమాచారం అందుకున్న దుబ్బాక అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. లక్ష తుక్కు సామాను కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు.